
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 22.641 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 3,252 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,880
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,485
3శాతం జీఎస్టీతో	రూ.5,650
సవర (8గ్రా)	రూ.45,200

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.5 /28.1

ఆదివారం గాలిలో తేమ 57 శాతం ఉంది. సోమవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జేడీగా గంగాభవానికి పదోన్నతి



నెల్లూరు(టౌన్): జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవానికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. గత నెల 31 డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమెకు జేడీగా పదోన్నతి కల్పించారు. అయితే ఆమెకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. త్వరలో గంగాభవానికి పోస్టింగ్ కల్పించనున్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు(క్రైమ్): రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.వేమారెడ్డి నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎం.నాగేశ్వరమ్మ డీటీసీ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా పోస్టింగ్‌లు దక్కించుకున్న వేమారెడ్డి, నాగేశ్వరమ్మలు జిల్లాకు సుపరిచితులే.

కామాక్షితాయికి వెండి హారం బహూకరణ



ఆలయ చైర్మన్‌కు వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయికి హైదరాబాద్‌కు చెందిన దాతలు గౌరీపెద్ది భరద్వాజ్, శ్రేయస దంపతులతో పాటు కుమార్తె ఇషామయూక ఆదివారం వెండి హారం, పళ్లెం బహూకరించారు. దాదాపు రూ.47 వేల విలువైన వెండి వస్తువులను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు చేతుల మీదుగా అమ్మవారికి అందజేశారు. అనంతరం గణపతిస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతలను అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని వేదాయపాళెం మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణస్వామి పంచాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మందిరంలో కొలువైన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామికి ప్రధానార్చకుడు బి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ నెల్లూరు శాఖ ప్రోగ్రాం అసిస్టెంట్ నాయక్ ఆధ్వర్యంలో మల్లెల శ్రీహరి భాగవత ప్రవచనం, హరికథాగానం, అనంతరం కళాకారిణి వసుంధర భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాలను మందిర ధర్మకర్త సీహెచ్ వెంకటేశ్వర్లు, రాకేష్, మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీ రాఘవేంద్ర, ఎస్.సుబ్బరామరాజు, ఉపాధ్యక్షుడు ఎన్.వేణుబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.మాలకొండయ్య, సలహాదారు ఎం.ఎల్.యాదవ్, కోశాధికారి వి.శ్రీనివాసులు పర్యవేక్షించారు.

బ్రెయిన్ క్యాన్సర్ మహిళకు ఆర్థిక సాయం



మహిళకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

చేజర్ల (సోమశిల): బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు అనంతసాగరం వికాస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిసి ఆదివారం రూ.9,116 ఆర్థిక సహాయం అందించారు. నెల్లూరు చంద్రబాబునగర్‌లో నివాసముంటున్న ఆవుల లక్ష్మీప్రియ బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమె వైద్యానికి తమ వంతుగా సహాయం అందించారు. ఆ మహిళ సన్నిహితులకు పాఠశాలలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు సరికొత్తగా..

ప్రజల సమస్యలు ఎక్కడికక్కడ.. ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా జిల్లాస్థాయి అధికారులకు ప్రజలు తమ సమస్యలపై అందజేస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో మరింత మార్పు తీసుకొస్తూ జిల్లాస్థాయి అధికారులు మండలాలకు వచ్చి మండలస్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రజలకు మరింత చేరువగా 'జగనన్నకు చెబుదాం'

- ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం
- ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల్లో నిర్వహణ
- ఇకపై వారంలో రెండు రోజులు మండలస్థాయిలోనూ అర్జీల స్వీకరణ
- అక్కడికే వెళ్లనున్న జిల్లాస్థాయి అధికారులు



కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'జగనన్నకు చెబుదాం' పేరుతో ప్రభుత్వం చేపడుతున్న అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ కానుంది. ఇందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇకపై మండలాల స్థాయిలో కూడా ఎంపిక చేసిన చోట్ల ప్రతి బుధ, శుక్రవారాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నారు. తద్వారా ప్రజల సమస్యలు మరింత వేగంగా పరిష్కారానికి నోచుకోనున్నాయి. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు వేర్వేరు బాధ్యతలు అప్పచెప్పారు. కలెక్టర్ సహా జిల్లాస్థాయి అధికారులందరూ అక్కడికే వెళ్లి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారం చూపనున్నారు. తద్వారా ప్రజలకు వ్యయప్రయాసలు కూడా తప్పనున్నాయి. ప్రతి వారంలో బుధ, శుక్ర వారాల్లో ఈ కార్యక్రమం నిర్వహణకు శ్రీకారం చుడుతున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎప్పటికప్పుడు మార్పులు

ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తోంది. ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేలా సంస్కరణలు చేపడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ పేరుతో వివిధ సమస్యలపై అర్జీలు తీసుకునేవారు. కానీ పరిష్కారం మాత్రం నామమాత్రంగానే ఉండేది. సమస్యలపై వచ్చిన వారే మళ్లీ కలెక్టరేట్‌కు కాళ్లరిగేలా తిరిగేవారు. ఇలా ఈ కార్యక్రమం ప్రహసనంగా మారింది. సమస్యలు పరిష్కారం కాక.. వ్యయప్రయాసలు తప్పక ప్రజలు విసిగివేసారి పోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీవెన్స్ సెల్‌ను స్పందన పేరుతో సరికొత్త సంస్కరణలతో చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్, ఆర్డీఓ, ఎంపీడీఓ, గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణను ప్రారంభించారు. ఫలితంగా ఏ గ్రామంలో నివసించే వారు అదే గ్రామ సచివాలయంలో తమ సమస్యను అధికారులకు విన్నవించే వెసులుబాటు కలిగింది. అక్కడ పరిష్కారం కాని సమస్య అయితే కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి వచ్చేవారు. అనంతరం 'జగనన్నకు చెబుదాం' పేరుతో నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేసే ప్రక్రియకు ప్రభుత్వం నాంది పలికింది. తద్వారా ఫిర్యాదు నేరుగా సీఎం కార్యాలయానికి చేరేలా ఆధునికీకరించారు. నేరుగా సీఎం కార్యాలయం దృష్టిలో సమస్య ఉండడంతో దీనిని తప్పనిసరిగా పారదర్శకంగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై పడింది. ఫలితంగా ప్రజలకు మరింత మేలు చేకూరింది. ఇదే క్రమంలో 'జగనన్నకు చెబుదాం' మండలస్థాయి కార్యక్రమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని ద్వారా సొంత మండలంలోనే అక్కడి ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని, పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తోంది. ఆ మండలానికి చెందిన వారు మాత్రమే అక్కడికి రావాల్సి ఉంటుంది.

అర్జీదారులకు సదుపాయాలు

మండలస్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని సౌకర్యాలను అధికారులు కల్పిస్తున్నారు. అర్జీదారులకు నీడనిచ్చేందుకు షామియానా, కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. వేదిక వద్ద ప్రజలు, జిల్లా అధికారులు, మండలస్థాయి అధికారులందరికీ కుర్చీలు ఏర్పాటు చేసే బాధ్యతను మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు. అలాగే గ్రామ సచివాలయాల నుంచి 10 మంది డిజిటల్ అసిస్టెంట్లు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను వేదిక వద్ద ఉండేలా చర్యలు తీసుకున్నారు. మండలస్థాయి కార్యక్రమం నిర్వహించే తేదీ వేదికకు సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారు. పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడే పరిష్కారమయ్యేలా ప్రభుత్వ చర్యలు చేపడుతోంది.

జిల్లాలో ఈ నెలలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించే మండల కేంద్రాలు

13వ తేదీన	దగదర్తి
15వ తేదీన	రాపూరు
20వ తేదీన	ఇందుకూరుపేట
22వ తేదీన	చేజర్ల
27వ తేదీన	పొదలకూరు
29వ తేదీన	కావలి

ప్రజలు వినియోగించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కొనసాగింపుగా మండల కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి వారంలో రెండు రోజులపాటు కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో తొలిసారిగా ఈ నెల 13న దగదర్తిలో నిర్వహిస్తున్నాం. నాతోపాటు ఇతర అధికారులందరూ అందుబాటులో ఉంటారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.హరినారాయణన్, కలెక్టర్

వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచితస్థానం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం సాయంత్రం మాలమహానాడు నేత కమతం అశోక్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, సీపీఎంకు చెందిన వందలాది మంది ఎంపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎంపీ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

డెయిరీ పార్లర్ ప్రారంభం

నగరంలోని 38వ డివిజన్ పరిధిలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఆదివారం విజయ డెయిరీ పార్లర్‌ను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. డెయిరీ పార్లర్ ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. 29వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో ఆదివారం ఏపీ ముస్లిం స్వర్ణకారుల సంఘం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వర్ణకారుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. అలాగే నూతన కార్యవర్గం ఎంపీ ఆదాలను సన్మానించింది. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో పటిష్ట బందోబస్తు



అయ్యప్పగుడి వద్ద బందోబస్తు విధుల్లో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో ఆదివారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. అన్ని ప్రధాన కూడళ్లు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌ల వద్ద పోలీసు బలగాలను మోహరించారు. ఎక్కడికక్కడా పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నించిన తెలుగుదేశం పార్టీ నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో పికెట్లను ఏర్పాటు చేశారు. ఏఆర్, స్పెషల్ పార్టీలు పహారా కాస్తున్నారు. కొందరు టీడీపీ నేతలు విచక్షణ కోల్పోయి పలువురు పోలీసు అధికారులను దుర్భాషలాడినా వారు సంయమనం పాటిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు, సభలు, ర్యాలీలు నిర్వహించరాదని వెల్లడించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసిన విషయం విదితమే. చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో సోమవారం టీడీపీ శ్రేణులు బంద్‌కు పిలుపునిచ్చిన క్రమంలో ప్రజాజీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

అధినేత అరెస్ట్ అయినా..!

- జిల్లావ్యాప్తంగా పచ్చనేతల నుంచి స్పందన నిల్
- పట్టించుకోని ద్వితీయ శ్రేణి క్యాడర్
- అవినీతి కేసులో అరెస్ట్ కావడంతో ప్రజల్లో చులకనవుతామేమోనని ఆందోళన

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి స్కాంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్ట్ అయిన నేపథ్యంలో జిల్లాలో రెండో రోజు కూడా ఆ పార్టీ నేతల నుంచి స్పందన కనిపించలేదు. సొంత పార్టీ నేతలే నిరసనలు, ఆందోళనల వైపు వెళ్లకపోవడం గమనార్హం. అవినీతి కేసులో చంద్రబాబును అన్ని ఆధారాలతో అరెస్ట్ చేయడంతో అందుకు మద్దతిస్తే ప్రజల్లో చులకన అవుతామేమోనని టీడీపీ నేతలకు భయం పట్టుకుందో ఏమో జిల్లాలో ఎక్కడా కూడా నిరసనలు, ఆందోళనలంటూ రోడ్లపై కనిపించిన దాఖలాలు లేవు. టీడీపీ కీలక నేతలను మాత్రం పోలీసులు రెండో రోజు కూడా ఇళ్లకే పరిమితం చేశారు. ద్వితీయ శ్రేణి క్యాడర్ నుంచి కూడా జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగలేదు.

పచ్చ క్యాడర్‌లో నిరుత్సాహం

జిల్లాలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. పతనావస్థలో ఉన్న తరుణంలో స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి కేసులో ఆ పార్టీ అధినేత అరెస్ట్ అయి రిమాండ్‌కు వెళ్లడంతో పార్టీ కేడర్‌లో మరింత నిరుత్సాహం నెలకొంది. జిల్లాలో ఎక్కడ చూసినా చంద్రబాబు అవినీతిపైనే తీవ్రంగా చర్చ జరుగుతోంది. నిన్నటి వరకు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తాను నిప్పు అంటూ చెప్పుకుని తిరిగిన చంద్రబాబు మరో కోణం బయటపడడంపై పార్టీలో చర్చనీయాంశమైంది. అంతేకాక ఉదయగిరి, కావలి, కోవూరు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న నేతలకు ఆ పార్టీ టికెట్‌లు వస్తాయన్న గ్యారెంటీ లేదు. ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నుంచి జంప్ అయిన ఎమ్మెల్యేలకు అవకాశం ఇచ్చి పార్టీని నమ్ముకున్న వారిని నట్టేట ముంచారు. నెల్లూరు సిటీ, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో వర్గపోరు తీవ్రంగా ఉంది. ఈ రాజకీయ పరిణామాల మధ్య క్యాడర్ పూర్తిస్థాయిలో నిరుత్సాహంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ నేపథ్యంలో మరోసారి టీడీపీ అధికారంలోకి వచ్చే చాన్స్ లేదని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ఈ క్రమంలో పార్టీ క్యాడర్ ముఖం చాటేసింది.

పోలీసుల ముందస్తు చర్యలు

చంద్రబాబు అవినీతి కేసులో అరెస్ట్ అయిన నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయడంతో ఎక్కడా నిరసనలు, ఆందోళనలు జరగలేదు. టీడీపీ నియోజకవర్గస్థాయి నేతలను ఇళ్లకే పరిమితమయ్యేలా చేయడంతో, సెకండ్ క్యాడర్ ముఖం చాటియ్యడంతో ఎక్కడా ఆందోళనలు జరగలేదు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటి ముందు రెండో రోజు ఆయన అనుచరవర్గం హడావుడి చేయబోయినా పోలీసులు వారి ప్రయత్నాలను భగ్నం చేశారు. కందుకూరులో పార్టీ ఇన్‌చార్జిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరెక్కడా కూడా టీడీపీ నేతలు రోడ్ల పైకి వచ్చిన దాఖలాలు లేవు.

సకల సౌకర్యాలతో.. నేలటూరుకు మోడల్ కాలనీలు

రూ.106 కోట్లతో కాలనీల నిర్మాణం

- లబ్ధిదారుడికి 30 అంకణాల స్థలం
- డబుల్ బెడ్ రూములతో గృహం
- ప్రతివీధిలో డ్రైనేజీలు, వీధిదీపాలు



నూతనంగా నిర్మించిన నేలటూరు మోడల్ కాలనీ

ముత్తుకూరు: మండలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల కాలుష్యానికి ఏళ్ల తరబడి నలిగిపోతున్న నేలటూరు పంచాయతీకి త్వరలో మోక్షం లభించనుంది. అటు ఏపీజెన్‌కో, ఇటు టీపీసీఐఎల్ ప్రాజెక్ట్‌ల నడుమ కునారిల్లుతున్న ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రక్రియ వేగవంతమైంది. అందుకోసం మోడల్ కాలనీల నిర్మాణం చేపడుతున్నారు. గ్రామాన్ని కాలుష్యం నుంచి రక్షించాలనే డిమాండ్ 8 ఏళ్లకుపైగా ఉన్నప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం గ్రామస్తుల కోరికను పెడచెవిన పెట్టింది. 2019లో ఎన్నికలకు ముందు కాలనీల నిర్మాణానికి హడావుడిగా శంకుస్థాపన చేసి చేతులు దులుపుకొంది.

రెండు చోట్ల కాలనీల నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నేలటూరు వాసుల కోసం మోడల్ కాలనీల నిర్మాణాన్ని ప్రారంభించారు. నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరు సమీపంలో నేలటూరు గ్రామస్తులకు రూ.68 కోట్ల అంచనాలతో సకల సౌకర్యాలు కలిగిన 309 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ధనలక్ష్మీపురం వద్ద నేలటూరు పట్టపుపాళెం వాసులకు రూ.38 కోట్లతో 171 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ విద్య,సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో ఈ మోడల్ కాలనీల నిర్మాణం చేపడుతున్నారు. నేలటూరు దళితవాడను తరలించేందుకు అవసరమైన సురక్షితమైన ప్రాంతాన్ని అన్వేషించడంలో గ్రామపెద్దలు నిమగ్నమయ్యారు.

మోడల్ కాలనీల్లో కల్పించే సౌకర్యాలు..

- రక్షిత మంచినీటి పథకాలు
- రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్
- పాఠశాలలు
- అంగన్‌వాడీ కేంద్రాలు
- ప్రార్థనా మందిరాలు
- చౌక దుకాణం
- ఆరోగ్య కేంద్రం
- కమ్యూనిటీ హాల్
- ధోబీఘాట్
- గ్రంథాలయం
- బస్ షెల్టర్లు



స్నానాల గదిలో కల్పించిన సౌకర్యాలు

గ్రామస్తుల భాగస్వామ్యం

మోడల్ కాలనీల నిర్మాణాన్ని నేలటూరు గ్రామస్తులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పరిశీలిస్తున్నారు. కాలనీలో అవసరమైన మార్పులు కోరుతూ సంతృప్తికరమైన గృహ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నారు. నెల్లూరు ఆర్డీఓ ఆధ్వర్యంలో కాలనీల నిర్మాణంపై తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. కరోనా కారణంగా రెండేళ్ల పాటు మోడల్ కాలనీల నిర్మాణం మందకొడిగా సాగింది. ఈ సంక్షోభం ముగిసిన తర్వాత కాలనీల నిర్మాణం పుంజుకొంది. కాగా కాలనీల నిర్మాణంలో భాగస్వామ్యంగా ఉన్న థర్మల్ ప్రాజెక్టు వాటా కింద విడుదల కావాల్సిన నిధులు నిలిచిపోయాయి. ఫలితంగా నిర్మాణ పనుల వేగం తగ్గింది.

విశాలమైన స్థలంలో ఖరీదైన ఇళ్లు

నేలటూరు గ్రామస్తుల కోసం సువిశాలమైన ప్రదేశంలో పటిష్టంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.13.25 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ప్రతి ఇంటిని 9.5 అంకణాలతో వరండా, హాలు, రెండు బెడ్ రూమ్‌లు, వంట గది, పూజ గది నిర్మిస్తున్నారు. కాలనీల్లో మౌలిక వసతుల్లో భాగంగా డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. కాలనీల విద్యుద్దీకరణకు రూ.2 కోట్ల మేర నిధుల చెల్లింపులు చేశారు.

పటిష్టంగా ఇళ్ల నిర్మాణం



నేలటూరు గ్రామస్తుల కోసం మాదరాజుగూడూరు వద్ద పటిష్టంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. గృహాలు నాణ్యత, డిజైన్ పరంగా బాగున్నాయి. గ్రామస్తులు కోరిన కొన్ని మార్పులను కూడా అంగీకరించి వాస్తు ప్రకారం ఇళ్లు నిర్మిస్తున్నారు. థర్మల్ ప్రాజెక్టు నుంచి రావాల్సిన మొదటి బిల్లుకు సంబంధించి నిధులు విడుదలైతే పనులు వేగమవుతాయి.

–సన్నారెడ్డి విజయులురెడ్డి, నేలటూరు.

నాణ్యత ప్రమాణాలతో గృహాల నిర్మాణం

నేలటూరు పంచాయతీవాసుల కోసం మాదరాజుగూడూరు, ధనలక్ష్మీపురం వద్ద మోడల్ కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పీఆర్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఈలు క్షుణ్ణంగా తనిఖీలు, పరీక్షలు నిర్వహించారు. నిర్మాణాలు సక్రమంగా ఉన్నట్టు నిర్ధయించారు. థర్మల్ ప్రాజెక్టుల వాటా కింద రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

–శ్యామ్‌సన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

క్లుప్తంగా

చంద్రబాబు అరెస్ట్ కక్ష సాధింపు చర్య కాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి

నెల్లూరు(దర్గామిట్ట): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడును సీఐడీ అరెస్ట్ చేస్తే ప్రతిపక్ష పార్టీల నాయకులు, ఎల్లో మీడియా కక్ష సాధింపు చర్యగా పేర్కొనడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైఎసార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు పాపాలు పండాయని, ఆయన అధికారంలో ఉన్న సమయంలో చేసిన కుంభకోణాల్లో ఇది చాలా చిన్నదని, ఇలాంటివి మరిన్ని బయపడనున్నాయని తెలిపారు. సీఐడీ అధికారులు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు జరిపి చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేశారని చెప్పారు. గతంలో ఇలాంటి కుంభకోణాల్లో అనేక మంది ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు ఆరోపణలు ఎదుర్కొన్నారని, జైలు శిక్షలు సైతం అనుభవించారని గుర్తుచేశారు. సీఐడీ అధికారుల దర్యాప్తుకు చంద్రబాబు సహకరించి నిజాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆందోళనలు చేయడం సిగ్గుచేటు అన్నారు.


సుశీల నేత్రాలయ ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నగరంలోని బృందావనంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుశీల నేత్రాలయాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ అత్యాధునిక వైద్యపరికరాలు, నేత్ర వైద్యంలో విశేష అనుభవం గడించిన వైద్యబృందంతో నెల్లూరు ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు ప్రజలకు అత్యాధునిక పరికరాలతో తక్కువ ఖర్చుతో ఉత్తమ సేవలు అందించాలని కోరారు. నేత్రాలయ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ పీ సుధాకర్‌రావు మాట్లాడుతూ తాను జన్మించిన నెల్లూరు జిల్లా ప్రజలకు అత్యాధునిక కంటి వైద్యసేవలు అందించాలని ఉద్దేశంతో తన తల్లి పేరుతో హాస్పిటల్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్ యాదవ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ అశోక్, 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమామహేశ్వరరావు, జిల్లా వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ మేనేజర్ వెంకట మురళి, డాక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని అన్ని శాఖల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగి సమస్యలపై నినదించాలని ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు సూచించారు. ఆదివారం నెల్లూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా స్థాయి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ నిర్వహించారు. ఈ సభకు ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ ఈవీఎం శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి జీవీ ప్రసాద్‌తో పాటు ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లం సురేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కింద స్థాయిలో అతితక్కువ వేతనానికి సమయపాలన లేకుండా పనిచేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి రాష్ట్రస్థాయిలో జేఏసీని బలోపేతం చేసుకుని సమస్యలపై ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా ముందుకు సాగాలని సూచించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచడంతో పాటు ప్రత్యేక సర్వీస్ రూల్స్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అక్టోబర్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న మహాజన సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. శరత్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ పీ వేణు, జిల్లా కమిటీ ప్రతినిధులు మస్తానయ్య, ఆనంద్‌బాబు, రాజేష్, కృష్ణ, జలేంద్ర, బాలాజీ, మహేష్‌బాబు, వెంకటేష్, రాధమ్మ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఆర్థిక ఉగ్రవాది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: మాజీ సీఎం చంద్రబాబు ఆర్థిక ఉగ్రవాది అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అభివర్ణించారు. ఆదివారం కోవూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనైనా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాదంటే ఆ ఫైల్‌ను నిలుపుదల చేస్తారన్నారు. దాన్ని తారుమారు చేసి వందల కోట్ల రూపాయలు తన ఖజానాలో వేసుకున్న ఘనుడు చంద్రబాబు అన్నారు. చంద్రబాబు రిమాండ్‌తో ఎన్టీఆర్ ఆత్మ ఆనందంగా ఉంటుందన్నారు. రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చినా ఏ ఒక్కరూ ముందుకు రాలేదని టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు అచ్చెన్నాయుడు అసహనంతో ఊగిపోతున్నారన్నారు. అందుకు సంబంధించిన ఆడియో రికార్డు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోందన్నారు. చంద్రబాబుకు తొత్తుగా మారి ఆయనిచ్చే సూట్ కేసులను తీసుకుని పవన్‌కళ్యాణ్ కపట ప్రేమ చూపిస్తున్నాడన్నారు. సొంత పుత్రుడు నారా లోకేశ్ కన్నా దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ రోడ్లపై దొర్లుతూ హడావుడి చేస్తుండడమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏనాడు ఆయన చేసిన తప్పులను పవన్ వేలెత్తి చూపలేదన్నారు. రెండెకరాలున్న చంద్రబాబుకు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయో అందరికీ తెలుసునన్నారు. చంద్రబాబు స్కాంల బాబుగా మారిపోయారన్నారు. ఆయన ఏనాడు టీడీపీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను దగ్గర పెట్టుకున్న పాపాన పోలేదన్నారు. ఎల్లప్పుడూ ఆయన సామాజిక వర్గానికి చెందిన వారినే పక్కన పెట్టుకుని ఆర్థికంగా బలపడ్డారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో బాబు దోపిడీని గుర్తించిన సీఐడీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని తెలిపారు. చంద్రబాబు పాత్రను తెలుసుకునే పోలీసులు అరెస్ట్ చేసినా టీడీపీ శ్రేణులు ఎవరూ బయటకురాలేదన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసే చంద్రబాబు పాపం పండిందన్నారు. అవినీతికి పాల్పడితే ఏనాడైనా శిక్ష తప్పదన్నారు. చంద్రబాబు మరో ఆరు జన్మలెత్తినా మళ్లీ సీఎం కాలేరని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పార్టీ కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల కన్వీనర్లు సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ఎంపీపీ నరసింహులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాపాలు బయట పడుతున్నాయి

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చేసిన పాపాలు ఇప్పుడు బయపడుతున్నాయని, ఆయన వయస్సై పోయిందని, ఇక ఆయనకు వచ్చేవి చేసిన పాపాలకు నోటీసులేనని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో రూ.371 కోట్లు దారి మళ్లించిన విషయంలో చంద్రబాబునాయుడును సీఐడీ అధికారులు అరెస్ట్ చేస్తే దానిని రాజకీయం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఆయన చేసిన స్కాంపై ఐదేళ్ల పాటు అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి అరెస్ట్ చేస్తే ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆయనకు మద్దతు తెలుపుతూ హడావుడి చేయడాన్ని చూస్తే వారికి అందులో భాగం ఉందనిపిస్తోందన్నారు. చంద్రబాబును సీఐడీ అధికారులు విచారణకు సహకరించాలని కోరితే తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పకుండా, నేను నిప్పు, నన్నే అరెస్ట్ చేస్తారా అంటూ మాట్లాడడం చూస్తేనే ఆయన అవినీతి తేటతెల్లమవుతుందన్నారు. చంద్రబాబునాయుడు అరెస్ట్ సమయంలో సొంత పుత్రుడి కన్నా దత్తపుత్రుడు పవన్ ఎక్కువ హడావుడి చేయడం చూస్తే వాళ్ల మధ్య ఉన్న బంధం స్పష్టమవుతుందన్నారు. గతంలో చంద్రబాబుకు ఐటీ అధికారులు రూ.118 కోట్ల లావాదేవీలకు సంబంధించి నోటీసులు అందజేయడంపై ఇంత వరకు ఎవరూ స్పందించలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో బాబు అరెస్ట్ అక్రమమంటూ బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు పురందేశ్వరి ట్వీట్ చేశారని, ఆమె ప్రజాపక్షమో, చంద్రబాబు పక్షమో ప్రజలకు తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందంటూ హడావుడి చేస్తున్న రామోజీరావు, రాధాకృష్ణ ఐటీ నోటీసులపై రాయడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ బాబు అవినీతికి పాల్పడిన విషయం స్పష్టంగా అర్థమైందన్నారు. అధికార పార్టీ నాయకులుగా తాము బాబుపై ఆరోపణలు చేయడం లేదని, ఐటీ శాఖ నోటీసులపై వివరణ మాత్రమే కోరుతున్నామన్నారు. అడ్డంగా దొరికిన చంద్రబాబు గురించి మాట్లాడితే తాము కూడా బయటపడుతామనే మిగిలిన వారందరూ మిన్నకుండిపోయారన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్య కాదని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్నదని వివరించారు. 2024 ఎన్నికల్లో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్పక మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి: రూ. 65
సన్నవి: రూ. 40
పండ్లు: రూ. 10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.150
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.256
స్కిన్‌లెస్ చికెన్:	రూ.284
లేయర్ చికెన్:	రూ.187

బోగస్ స్కీంలతో ప్రజాధనాన్ని బాబు లూటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు బోగస్ స్కీంలతో ప్రజలను మభ్యపెట్టి ప్రజాధనాన్ని లూటీ చేశారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం కావలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో బాబు వస్తే జాబు వస్తోందని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోగా, నిరుద్యోగ యువతను స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో మోసం చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేసి షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నాడని ఆరోపించారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయాననే బాధ తప్ప, అందుకు తాను సూత్రధారిని కాదని చెప్పే ధైర్యం మాత్రం చంద్రబాబులో కనిపించడం లేదన్నారు. గజదొంగను అరెస్ట్ చేస్తే సానుభూతి అంటూ ఎల్లోమీడియా ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబును నేరస్తుడిగా గుర్తించి సీఐడీ అరెస్ట్ చేస్తే, పురందేశ్వరి, పవన్‌కళ్యాణ్‌తో పాటు సీపీఐ నాయకులు ఆయనకు మద్దతుగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట అని, వాటిపై నమ్మకంపోతున్న దశలో ఆయన్ని అరెస్ట్ చేయడంతో సామాన్య ప్రజలకు మళ్లీ నమ్మకం కలుగుతోందన్నారు. తన అనుకూల ఎల్లో మీడియా ద్వారా ప్రజలను నమ్మించవచ్చనే ధైర్యంతోనే చంద్రబాబు ఇన్ని అక్రమాలు చేశారన్నారు. చంద్రబాబుది అంతులేని అవినీతి కావడంతోనే ప్రజలు ఆయనకు 2019లో గట్టిగా బుద్ధి చెప్పారన్నారు.

కౌలుకు తీసుకుని కబ్జా

- భూ యజమానులను బెదిరించి రూ.1.25 కోట్ల విలువైన ఐదెకరాలు సొంతం
- మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి ప్రధాన అనుచరుడి నిర్వాకం



మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పక్కన నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి(ఫైల్)

కోవూరు: టీడీపీ నేతల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేట్ భూములను సైతం కబ్జా చేస్తున్నారు. కౌలు పేరిట తీసుకుని భూ యజమానులను బెదిరించి స్వాహా చేస్తున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రధాన అనుచరుడిగా చలామణి అవుతున్న బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన ఓ వ్యక్తి ఇలాంటి నిర్వాకానికి పాల్పడ్డాడు. రూ.1.25 కోట్ల విలువైన ఐదెకరాలను కౌలుకు తీసుకుని ఆక్రమించాడు. బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో సదరు నేత కబ్జా పర్వం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం కట్టుబడిపాళేనికి చెందిన కాకుమాను కృష్ణకుమారి, కాకుమాను మాధురిదేవికి వవ్వేరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లలో 1023-ఏ,బీ, 1024-ఏ,బీ, 512-1బీ,బీలో ఐదెకరాల భూమి ఉంది. వంశపారంపర్యంగా వచ్చిన ఈ భూమిని అదే ప్రాంతానికి చెందిన నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి కౌలుకు ఇచ్చారు. పొలం యజమానులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇదే అదనుగా నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి ఎలాగైనా భూమిని సొంతం చేసుకోవాలని భావించాడు. రెవెన్యూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి రెవెన్యూ రికార్డుల్లో తన తల్లి నెల్లూరు మీనాక్షమ్మ పేరుపై భూమిని నమోదు చేయించుకున్నాడు. గత మూడేళ్లుగా కౌలు చెల్లించలేదు. భూమిని సైతం అప్పగించలేదు. దీంతో భూయజమానులు గట్టిగా నిలదీయగా పొలం తనదని, మీకు కౌలు చెల్లించాల్సిన అవసరం లేదని బెదిరించాడు. దీంతో భూయజమానులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించగా మీనాక్షమ్మ పేరుపై భూములు నమోదై ఉన్నాయి. దీంతో తహసీల్దార్ ఈ నెల 16న భూ హక్కు పత్రాలతో విచారణకు హాజరుకావాలని నెల్లూరు ప్రభాకర్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుచ్చి ఎస్సై వీరప్రతాప్ చీటింగ్ కేసు నమోదు చేశారు.

జీవనోపాధికి చేపల కొనుగోలుకు వెళ్లొస్తుండగా..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని భర్త దుర్మరణం
- తీవ్రంగా గాయపడిన భార్య




చినశేషయ్య మృతదేహం


కావలి: చేపల విక్రయం ద్వారా జీవనోపాధి సాగిస్తున్న భార్యాభర్తలను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో భర్త దుర్మరణం చెందాడు. భార్య తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన పట్టణంలోని ముసునూరు వద్ద చెన్నై-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. కావలి రూరల్ మండలం కొత్తసత్రం గ్రామానికి చెందిన పామంజి చిన్నశేషయ్య (70), గోవిందమ్మ దంపతులు. వారు చేపల విక్రయం ద్వారా జీవనోపాధి సాగిస్తున్నారు. ఆదివారం చేపల కొనుగోలుకు టీవీఎస్ స్కూటీపై బిట్రగుంట చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ చేపలు లేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ముసునూరు వద్ద ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో భర్త ఘటనా స్థలంలో దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన భార్యను కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చిన్నశేషయ్య మృతదేహాన్ని రూరల్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

పోలీసులకు సవాల్‌గా చిన్నారుల మరణాలు

- 14 రోజుల వ్యవధిలో ఇద్దరు
- ప్రకాశం జిల్లాలో రోడ్డు పక్కన ఒకరు
- నెల్లూరు జిల్లాలో సమద్రం ఒడ్డున మరొకరు
- మిస్టరీగా చిన్నారుల మరణాలు
- కొలిక్కిరాని పోలీసు దర్యాప్తు



జువ్వలదిన్నె తీరంలో లభించిన బాలిక మృతదేహం



యర్రగొండపాళెం వద్ద లభించిన బాలుడి మృతదేహం

బిట్రగుంట: నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఆగస్టులో జరిగిన రెండు ఘటనలు పోలీసు శాఖకు సవాల్ విసురుతున్నాయి. రెండు ఘటనల్లో 14 రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులను దారుణంగా హతమార్చారు. ఇప్పటి వరకు మృతి చెందిన చిన్నారులకు సంబంధించి చిన్నపాటి వివరాలు కూడా తెలియకపోవడం మిస్టరీగా మారింది. రెండు ఘటనలకు సంబంధం ఉందా..లేక వేర్వేరుగా జరిగిన దారుణాలా అనే విషయంలో కూడా స్పష్టత లోపించింది. ప్రకాశం జిల్లా యర్రగొండపాళెం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మార్కాపురం వెళ్లే మార్గంలో ఆగస్టు 16న నాలుగు నుంచి ఆరేళ్లలోపు వయస్సున్న బాలుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో బాలుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నీ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహం వెలుగు చూసే సమయానికి బాగా కుళ్లిపోయి ఉండడంతో మూడ్రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా రాష్ట్రంలోని అన్నీ జిల్లాలతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాల్లోని మిస్సింగ్ కేసుల వివరాలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అంతే కాకుండా సాంకేతిక అంశాల ఆధారంగా కూడా దర్యాప్తు చేపట్టారు. ఆ మార్గంలో టోల్‌ప్లాజాల్లో నమోదైన వాహనాలకు సంబంధించిన డేటాను కూడా విశ్లేస్తున్నారు. కొన్ని ప్రత్యేక బృందాలు ఇతర రాష్ట్రాల్లో కూడా వివరాలు సేకరిస్తున్నాయి. అయినా కూడా ఇంత వరకు చిన్నపాటి ఆధారాలు కూడా లభ్యం కాలేదు. అదే తరహాలో జిల్లాలోని బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో ఆగస్టు 30న పదేళ్ల బాలిక మృతదేహం వెలుగు చూసిన విషయం తెలిసిందే. సముద్రంలో కొట్టుకొస్తున్న బాలిక మృతదేహాన్ని స్థానిక మత్స్యకారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో కూడా పోలీసులు ఇంత వరకు ఎలాంటి పురోగతి సాధించలేదు. బాలికకు సంబంధించి ఎక్కడా మిస్సింగ్ కేసులు నమోదు కాకపోవడంతో దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

రెండు ఘటనలకు సంబంధం ఉందా..?

ప్రకాశం జిల్లాలో వెలుగు చూసిన బాలుడి మృతి ఘటనకు, జువ్వలదిన్నెలో సముద్రంలో కొట్టుకువచ్చిన బాలిక మృతి ఘటనకు మధ్య సంబంధం ఏదైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. ఈ రెండు ఘటనల్లో ఇంత వరకు వివరాలు లభించకపోవడం, మిస్సింగ్ కేసులకు సంబంధించిన వివరాలు సరిపోలక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యర్రగొండపాళెం వద్ద లభించిన బాలుడి వయస్సు నాలుగు నుంచి ఆరేళ్లలోపు ఉండవచ్చని అనుమానిస్తుండగా, జువ్వలదిన్నె వద్ద లభించిన బాలికకు 8 ఏళ్ల నుంచి 10 ఏళ్లలోపు వయస్సు ఉండొచ్చని భావిస్తున్నారు. ఇద్దరివి కూడా గుండ్రని ముఖాలే కావడం గమనార్హం. ఈ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తే మిస్టరీ వీడే అవకాశం ఉంది.